
సాక్షి

కాకినాడ

సోమవారం । 12 । జూన్ । 2023



ఎంతటీ విషాదం

తలుపులమ్మ అమ్మవారి సన్నిధికి వ్యాన్‌లో వెళ్లి వస్తున్న వారు ఓ టీ షాపు వద్ద ఆగారు. టీ తాగి బయలుదేరుతున్న వారిని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. -8లో



కల్యాణాలకు కాస్త బ్రేక్

రెండు నెలలుగా సాగిన వివాహాది శుభకార్యాలకు తాత్కాలికంగా తెర పడింది. ఆదివారం రాత్రి, తెల్లవారు జామున జరిగే వివాహాలే ఈ సీజన్‌లో చివరివి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
45.5° / 28.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	45.5	29.0
కాకినాడ	42.5	29.7
అమలాపురం	40.0	28.0

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ కలెక్టర్

యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 3077కు ఫోన్ చేసి నేరుగా తనకు తెలియజేయవచ్చని వెల్లడించారు. అలాగే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని యథావిధిగా ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు.

విదేశాంగ శాఖ సహాయ మంత్రి నేడు రాక

కాకినాడ రూరల్/బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ సోమవారం కాకినాడ రానున్నారు. తొలుత ఆయన విశాఖపట్నం నుంచి పిఠాపురం మండలం ఫక్రుద్దీన్‌పాలెం చేరుకుంటారు. అక్కడ పర్యటన అనంతరం ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య కాకినాడ రూరల్ మండలంలోని పెనుమర్తి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం 12.45 నుంచి 1.30 గంటల మధ్య గంగనాపల్లి గ్రామంలోని ఆయుష్మాన్ భారత్ క్లినిక్‌ను సందర్శిస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనను ప్రజలకు వివరించేందుకు ఆయన వస్తున్నారని బీజేపీ సిటీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ ఆదివారం విలేకర్లకు తెలిపారు. మధ్యాహ్నం సాంబమూర్తి నగర్‌లో ఈఎస్‌ఐ వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తారన్నారు. అనంతరం సినిమా రోడ్డులోని ఎన్వీఆర్ ఫంక్షన్ హాలులో కార్యకర్తలతో సహపంక్తి భోజనాల్లో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పార్టీ సీనియర్ కార్యకర్తలతో ముచ్చటిస్తారని, 3.30 గంటలకు వివిధ మోర్చాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. 4.30 నుంచి 5.30 గంటల వరకూ కాకినాడలోని ప్రముఖులను కలుసుకుంటారన్నారు. అనంతరం డైరీఫారం సెంటర్ రాజీవ్ గృహకల్పలో గృహసంపర్క్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాత్రి ఏడు గంటలకు రామారావుపేటలో 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'లో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో మురళీధరన్ పాల్గొంటారని సత్యనారాయణ తెలిపారు.

రత్నగిరికి భక్తుల తాకిడి



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. కొండపై శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు అధిక సంఖ్యలో సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. వీరితో పాటు సాధారణ భక్తుల తాకిడి కూడా ఎక్కువగా ఉండటంతో ఆలయం కిక్కిరిసింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. వ్రతాలు 2,500 జరిగాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మందికి భోజనం పెట్టారు.

లోవకు పోటెత్తిన భక్తులు



తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు క్యూ కట్టిన భక్తులు

తుని రూరల్: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో లోవ దేవస్థానం ఆదివారం కిక్కిరిసింది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 15 వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,38,400, పూజా టికెట్లకు రూ.1,45,610, కేశఖండన శాలకు రూ.11,050, వాహన పూజలకు రూ.6,030, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.86,400, విరాళాలుగా రూ.1,46,823 కలిపి మొత్తం రూ.5,34,312 ఆదాయం సమకూరిందని వివరించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులతో కలసి ఈఓ పర్యవేక్షించారు.

సరస్వతీ నమస్తుభ్యం

- మోగనున్న బడి గంట
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- 17 వరకూ ఒంటిపూట బడులు
- తీవ్ర ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం
- విద్యార్థులకు తొలి రోజే జగనన్న విద్యా కానుక
- 1,283 పాఠశాలల్లో 1,59,797 మందికి పంపిణీ



పాత, కొత్త నేస్తాల కోసం సరస్వతీ నిలయాలు చేతులు చాస్తున్నాయి. కొన్నాళ్ల విరామం అనంతరం తిరిగి గణగణ మోగేందుకు బడి గంట ఉవ్విళ్లూరుతోంది. పుస్తకాల సంచులు, క్యారియర్ బ్యాగ్‌లను ముస్తాబు చేసే పనిలో తల్లిదండ్రులున్నారు. విద్యార్థుల చేతిలో కొత్త పాఠ్య పుస్తకాలు, నోట్బులు తదితర విద్యా సామగ్రి ఇమిడిపోయేందుకు సిద్ధమయ్యాయి. పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో విద్యార్థులు ఆటపాటలకు సెలవు చెప్పి.. పుస్తకాల సంచులు తిరిగి భుజానికెత్తుకుని.. విద్యాబుద్ధులు నేర్పే చదువులమ్మ చెట్టు నీడకు చేరుకునేందుకు సిద్ధపడుతున్నారు.

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రంగురంగుల భవనాలు.. అద్దంలా మెరిసిపోయే ఫ్లోరింగ్.. విద్యార్థులను ఆకట్టుకునే రంగురంగుల డ్యూయల్ డెస్కులు.. చల్లని గాలినిచ్చే ఫ్యాన్లు.. పరిశుభ్రతతో కూడిన టాయిలెట్లు.. ఇదీ నేటి ప్రభుత్వ బడుల పరిస్థితి. మన బడి నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూలంగా మార్చారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 2022–23 విద్యా సంవత్సరాన్ని ఘనంగా ముగించిన ప్రభుత్వం, 2023–24 విద్యా సంవత్సరాన్ని అంతే ఉత్సాహంతో ప్రారంభించేందుకు సమాయత్తమైంది. సుమారు 40 రోజుల వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ చిన్నారులు బడి బాట పట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 931 ప్రాథమిక, 105 ప్రాథమికోన్నత, 247 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,59,797 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 1,11,137 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఈ నెల 17వ తేదీ వరకూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకూ ఒక్క పూట మాత్రమే నిర్వహిస్తారు.

స్కూల్ రెడీనెస్

గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా ప్రభుత్వం స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్ అమలు చేసింది. ఇందులో భాగంగా గత నెల 25వ తేదీ నుంచే జిల్లావ్యాప్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. దీంతో పాటు పాఠశాలలను శుభ్రం చేయడం, తాగునీటి సౌకర్యాలు, మధ్యాహ్న భోజనానికి అవసరమైన విధంగా కిచెన్ షెడ్లు సిద్ధం చేయడం, చిన్నపాటి మరమ్మతులు, రికార్డు షీట్లు రెడీ చేయడం, అడ్మిషన్లు చేపట్టడం వంటి పనులను ఇప్పటికే ఉపాధ్యాయులు చేపట్టారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పాఠశాలల ప్రారంభం రోజు నుంచే తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల బదిలీలు కూడా పూర్తి చేయడం విశేషం.

జగనన్న విద్యా కానుక సిద్ధం

ఒకప్పుడు వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు సాదాసీదాగా ప్రారంభమయ్యేవి. ఇప్పుడు దీనికి భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఉత్సాహపూరిత వాతావరణం తీసుకువచ్చింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే రీతిలో వసతులు కల్పించింది. రెండో విడత మన బడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది జిల్లాలోని 896 పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.342 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకూ రూ.100 కోట్లు ఖర్చు చేసి, వివిధ పాఠశాలలను అభివృద్ధి చేశారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా 'జగనన్న విద్యా కానుక' అందిస్తోంది. ఇందులో భాగంగా స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, ఒక జత షూస్, రెండు జతల సాక్సులు, బెల్టు, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ తదితర వస్తువులను ప్రతి విద్యార్థికీ అందజేయనున్నారు. పాఠశాలలకు వచ్చిన రోజునే విద్యార్థులకు ఈ కానుక అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లోని 1,283 పాఠశాలల్లో ఉన్న 1,57,797 విద్యార్థులకు అవసరమైన విద్యా కానుకలను ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసింది.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గండేపల్లి	41	4,252
గొల్లప్రోలు	41	5,506
జగ్గంపేట	47	7,460
కాజులూరు	79	5,259
కాకినాడ రూరల్	77	9,837
కాకినాడ సిటీ	87	20,115
కరప	65	6,288
కిర్లంపూడి	41	6,268
కోటనందూరు	32	3,352
పెదపూడి	59	4,311
పెద్దాపురం	79	9,746
పిఠాపురం	80	9,385
ప్రత్తిపాడు	48	6,831
రౌతులపూడి	44	4,540
సామర్లకోట	75	9,259
శంఖవరం	48	5,187
తాళ్లరేవు	78	8,165
తొండంగి	64	7,611
తుని	91	11,414
యు.కొత్తపల్లి	67	8,105
ఏలేశ్వరం	40	6,916

వినూత్న సంస్కరణలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ విద్యారంగంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా లెర్న్ ఎ వర్డ్ ఎ డే, టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ (తర్ల్), వారంలో ఒక రోజు విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం, అదే రోజు నో బ్యాగ్‌డే అమలు, ఇంగ్లిషు మీడియంలో విద్య తదితర సరికొత్త కార్యక్రమాలను అమలు చేస్తోంది.

విద్యపై ఖర్చు వృథా కాదు



విద్యపై పెట్టే ఖర్చు వృథా కాదనే ఉద్దేశంతో సర్కారీ పాఠశాలలను కార్పొరేటుకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులూ కల్పిస్తోంది. బడి ఈడు ఉన్న చిన్నారులందరూ పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జిల్లా విద్యాశాఖాధికారి

రాష్ట్ర ఉత్తమ రైతుగా సత్యనారాయణరాజు



పి.గన్నవరం: గంటి పెదపూడికి చెందిన అభ్యుదయ రైతు మంతెన సత్యనారాయణరాజును రాష్ట్ర ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు ఆదివారం ఈ విషయం తెలిపారు. విజయవాడలో సోమవారం జరిగే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవ సభలో సత్యనారాయణరాజుకు అవార్డును ప్రదానం చేస్తారని చెప్పారు. శ్రీ వి.రామచంద్రరావు మెమోరియల్ ఉత్తమ రైతు అవార్డు పేరిట రూ.25 వేల నగదు ప్రోత్సాహకం, మెమెంటో, పురస్కార పత్రం అందజేస్తారన్నారు. మంతెన సత్యనారాయణరాజు 40 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాగు చేస్తున్నారు. విత్తనోత్పత్తి చేస్తూ నాణ్యమైన వరి విత్తనాలను తోటి రైతులకు అందజేస్తున్నారు. సాగులో యాంత్రీకరణ విధానాన్ని అవలంబించి పలువురు శాస్త్రవేత్తలు, రైతుల అభిమానాన్ని చూరగొన్నారు. రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికైన ఆయనను పలువురు అభినందించారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం



నిత్య గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గరిక పూజ చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పలువురు నూతన వాహనాలకు పూజలు, చిన్నారులకు అన్నప్రాశనలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు చేయించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా ఈ ఒక్క రోజే రూ.1,71,562 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కాజులూరు: పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని శలపాకలో 10.80 ఎకరాల స్థలంలో శలపాక, గొల్లపాలెం, తణుకువాడ, బందనపూడి, మతుకుమిల్లి గ్రామాలకు చెందిన 436 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ పోతుల గనిరాజు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న పథకాలు పేదల జీవితాలకు కొత్త వెలుగులు తెచ్చాయన్నారు. ఇందులో భాగంగానే గూడులేని ప్రతి పేదవానికి ఇళ్ల స్థలం అందించటానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, దీనిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదేమైనా పేదల పక్షాన నిలిచి సీఎం జగన్ అందరి ఆదరాభిమానాలను చూరగొన్నారని మంత్రి వేణు అన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, ఆర్ఎంసీ డైరెక్టర్లు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, దంగేటి అరుణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు పితాని సుబ్రహ్మణ్యం, సత్తి శ్రీరామారెడ్డి, సమనాశి సోమన్న పాల్గొన్నారు.



శలపాకలో లబ్ధిదారుకు ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

సెగ... భగభగ

- మండిస్తున్న మృగశిర
- ఉమ్మడి జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు

సాక్షి, అమలాపురం: రోహిణీ కార్తెను మించిన ఎండలతో మృగశిర మండిస్తోంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో భానుడు మరింత చెలరేగిపోతున్నాడు. రోహిణిలో కూడా నమోదు కాని అధిక ఉష్ణోగ్రతలు మృగశిర కార్తెలో నమోదవుతుండడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాపై సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. గడచిన నాలుగైదు రోజులుగా ఉగ్రరూపం దాలుస్తున్నాడు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం సూర్యుడు మరింత సెగ పుట్టించాడు. రాజమహేంద్రవరంలో అత్యధికంగా 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్ఠంగా 29 డిగ్రీలు, కాకినాడలో గరిష్ఠంగా 42.5, కనిష్ఠంగా 29.7, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో గరిష్ఠం 40.5, కనిష్ఠం 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ మండిపోతోంది. దీంతో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండకు తోడు వేడి గాలులు వీస్తూండటంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ఉక్కపోత సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రాత్రవుతున్నా వేడి తగ్గకపోవడంతో ఫ్యాన్ల నుంచి వచ్చే వేడిగాలికి సామాన్యులు ఆపసోపాలు పడుతున్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా శ్రీహరికోట వరకూ విస్తరించాయని వాతావరణ శాఖ ప్రకటించడం కొంత ఊరటనిచ్చే అంశం.



అమలాపురం మండలం భట్లపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై తగ్గిన జనసంచారం

గడప చెంతకే పౌష్టికాహారం

- వచ్చే నెల నుంచి అంగన్‌వాడీల్లో అమలు
- కేంద్రాలకు దూరంగా ఉన్నవారికి ఎంతో ఉపయోగం
- జిల్లాలో 1,28,392 మందికి లబ్ధి
- రెండు విడతల్లో పంపిణీకి చర్యలు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 10
అంగన్‌వాడీ కేంద్రాలు	: 1,986
వీటిల్లోని చిన్నారులు	: 1,07,660
గర్భిణులు, బాలింతలు	: 20,732



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అందజేస్తున్న పౌష్టికాహారం కిట్లు

కాకినాడ సిటీ: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న కిట్ల ద్వారా వారి ఆరోగ్యానికి రక్షణనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పోషకాహారం సక్రమంగా అందేది కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు శ్రీకారం చుట్టారు. నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసి, లబ్ధిదారులకు సరకులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బాలింతలు, గర్భిణులు ఆహారం తినే ఏర్పాటు చేశారు. ఫలితంగా ఈ కేంద్రాలు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాయి. ఆయా కేంద్రాలకు వచ్చే వారికి అక్కడి సిబ్బంది పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలిస్తూ తగిన సూచనలు ఇస్తూంటారు. అంగన్‌వాడీలకు దూరంగా ఉండి, ఆ కేంద్రాలకు కొంతమంది రాలేకపోతున్నారు. కొన్ని గ్రామాల్లో పౌష్టికాహారం తీసుకునేందుకు లబ్ధిదారులు అర కిలోమీటరు నుంచి కిలోమీటరు వరకూ దూరం వెళ్లాల్సి వస్తోంది. అంత దూరం వెళ్లి, ఆహారం తీసుకోవడం వారికి ఇబ్బందిగా మారింది. పౌష్టికాహారం తీసుకోనందు వలన కొంతమంది రక్తహీనత తదితర సమస్యల బారిన పడుతున్నారు. దూరాభారం కావడంతో తమకు ఇంటి వద్దనే పౌష్టికాహారం ఇవ్వాలని పలువురు విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ప్రభుత్వం ఇక నుంచి లబ్ధిదారుల ఇళ్లకే పౌష్టికాహార కిట్లు పంపించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పౌష్టికాహారం అందించనున్నారు.

ఏమేమిస్తారంటే..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు ప్రతి నెలా 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో నూనె, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల చొప్పున ఖర్జూరం, బెల్లం, చిక్కీలు జగనన్న కిట్‌లో పంపిణీ చేస్తారు.
- 7 నెలల నుంచి 36 నెలల చిన్నారులకు నెలకు 2.5 లీటర్ల పాలు, 2.5 కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లు ఇంటి వద్దనే ఇస్తారు.
- ప్రీ స్కూల్ పిల్లలకు (37 నెలల నుంచి 72 నెలలు) రోజూ 100 మిల్లీలీటర్ల పాలు, కోడి గుడ్డు ఇస్తారు.

సంతోషంగా ఉంది



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను అన్నలా ఆదుకుంటున్నారు. వేసవి, వర్షాకాలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం గర్భిణులు, బాలింతలకు ఇబ్బందిగా ఉందని సర్వేకు సంబంధించి మాకు వచ్చిన ఫోన్ కాల్‌లో చెప్పాం. ప్రభుత్వం స్పందించి ఇంటికే సరుకులిచ్చేలా ఆదేశాలివ్వడం చాలా సంతోషంగా ఉంది. గర్భిణులు, బాలింతలం జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఓలేటి దుర్గాభవాని

రెండు విడతల్లో..



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం వండి పెడుతున్న భోజనం స్థానంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు ఇంటికే సరుకులు పంపిస్తాం. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ లోపు మొదటి విడత, 16, 17 తేదీల్లో రెండో విడతగా సరకులు అందజేస్తాం.

– కె.ప్రవీణ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, కాకినాడ జిల్లా

నేటి నుంచి నాలుగో బ్యాచ్ జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో నాలుగో బ్యాచ్ జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ సోమవారం ప్రారంభం కానుంది. ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న 11 జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు ఇక్కడ బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. జెడ్పీటీసీ సభ్యుల హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన, జెడ్పీ సమావేశాలపై ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని వేణుగోపాల్ తెలిపారు.

రూ.లక్ష విరాళం



అపర్ణాదేవికి పూజలు చేస్తున్న కర్ణాటక మాజీ మంత్రి ఎంఆర్ సీతారాం దంపతులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయ అభివృద్ధికి కర్ణాటక మాజీ మంత్రి ఎంఆర్ సీతారాం, శృతి సీతారాం దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మాజీ మంత్రి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం సత్రం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

సత్యదేవుని దర్శనానికి నిబంధనలు కఠినతరం

- వికలాంగులు, వృద్ధులకే లిఫ్ట్ సౌకర్యం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశం



ఈఓ ఆదేశాల మేరకు ఆదివారం తొమ్మిది గంటల నుంచి ఒంటి గంట వరకు నిలిపివేసిన లిఫ్ట్

అన్నవరం: ఇకపై అన్నవరం సత్యదేవుని దర్శనానికి, వ్రతాలకు తమ బంధువులను తీసుకువెళ్లే దేవస్థానం సిబ్బంది నిబంధనలను కచ్చితంగా పాటించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. పీఆర్వో కార్యాలయంలో సిబ్బంది బంధువుల వివరాలు నమోదు చేయించాక ఇచ్చే టోకెన్ ప్రకారం దర్శనం, వ్రతం టిక్కెట్లు కొనుగోలు చేయాలని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక సర్క్యులర్ విడుదల చేశారు. బంధువులతో పాటు సిబ్బంది ఆలయం వద్దకు వెళ్లకూడదని, వారి బంధువులను మాత్రమే పంపించాలని పేర్కొన్నారు. తూర్పు రాజగోపురం, పశ్చిమ రాజగోపురం వద్ద టిక్కెట్ల కౌంటర్లలోనే నిబంధనల ప్రకారం దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేయాలని అన్నారు. ఆలయం లోపల కొనుగోలు చేస్తామంటే ఇక కుదరదని తెలిపారు. దేవస్థానం లిఫ్ట్‌లో వృద్ధులు, వికలాంగులతో పాటు ఇతరులూ ఆలయానికి వెళ్తున్నట్లు గుర్తించామని, ఇకపై ఇతరులకు అవకాశం ఉండదన్నారు. శని, ఆదివారాలు, పర్వదినాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ లిఫ్ట్‌ను నిలుపుదల చేయాలని సూచించారు. ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు.

దింపు కార్మికుడి మృతి

ముమ్మిడివరం: తాటి చెట్టుపై నుంచి పడి ఓ దింపు కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఠానేల్లంక మొల్లికి చెందిన కంచి శ్రీనివాసరావు శనివారం తాటి ముంజెలు కొడుతుండగా ఆ గెల అతనిపై పడింది. దీంతో శ్రీనివాసరావు చెట్టుపై నుంచి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతనిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య వెంకట సూర్యకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. ఈ మేరకు ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ హెచ్‌సీ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంతటీ విషాదం

- టీ తాగి వస్తున్న వ్యాన్ ప్రయాణికులు
- దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు
- ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు

గండేపల్లి: కునుకు పడుతోంది... కనురెప్పలు మూసుకుంటున్నాయి.. శరీరం సహకరించడం లేదు.. ఇలా అయితే డ్రైవింగ్ కష్టమని తలచిన డ్రైవర్ తన వ్యాన్‌ను టీ టైం షాపు వద్ద నిలిపాడు.. టీ తాగేందుకు ఆ వాహనంలోని ప్రయాణికులూ వెళ్లి వస్తుండగా బస్సు దూసుకొచ్చింది. ఈ సంఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఆరుగురు గాయాల పాలైనట్లు ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జిన్నూరు పాలేనికి చెందిన సుమారు 35 మంది తుని వద్ద తలుపులమ్మ లోవ అమ్మవారిని దర్శించుకునేందుకు శనివారం వచ్చారు. అక్కడే భోజనాలు చేసి వంట సామగ్రితో అదేరోజు రాత్రి సుమారు 12.30 గంటలకు వారు వచ్చిన వ్యాన్‌లో తిరిగి బయలుదేరారు. అర్ధరాత్రి 2.30 నుంచి 3 గంటల మధ్య మండలంలోని మురారి శివారు ఎస్సార్ బంక్ సమీపంలోని టీ టైం షాపు వద్దకు వచ్చేసరికి డ్రైవర్ ముల్లుల శ్రీను వ్యాన్‌ను ఆపాడు. డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు వ్యాన్ దిగి టీ తాగిన అనంతరం బయలు దేరేందుకు సిద్ధమవుతుండగా.. ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విశాఖ, భువనేశ్వర్ వెళుతున్న ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు వీరిని వేగంగా ఢీకొంది. అనంతరం టీ టైం షాప్ పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని ప్రయాణికుడు కుక్కల ఉమాసత్యసాయి (22) బస్సు అడుగు భాగంలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. ముల్లుల ఆంజనేయులు (23), చల్లబోయిన సాయిరామ్, గుబ్బల శ్రీను, కుక్కల వంశీ, సురేష్, బాలాజీ, బుంగ వంశీలు బస్సు ఢీకొనడంతో చెల్లాచెదురుగా పడిపోయారు. క్రేన్ సహాయంతో బస్సును పక్కకు నెట్టించి ఉమా సత్యసాయి మృతదేహాన్ని బయటకు తీసి క్షతగాత్రులను 108, హైవే అంబులెన్స్‌లలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ముల్లుల ఆంజనేయులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. తెల్లవారుజాము ప్రయాణమే తమ తోటి ప్రయాణికుల ప్రాణాలు తీసిందని బంధువులు, ప్రయాణికులు రోదించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్, హైవే మెయింటెనెన్స్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి ప్రమాదానికి కారణమైన బస్సును క్రేన్ సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి ముందు టీ టైం షాపు వద్ద అప్పటికే ఆగి ఉన్న లారీ రోడ్డుపైకి రావడంతో అటుగా వేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు వ్యాన్ ప్రయాణికులను ఢీకొందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు.



ఉమాసత్యసాయి (ఫైల్)



ఆంజనేయులు (ఫైల్)

పోలీసు ఉద్యోగం కల తీరకుండానే..

వ్యాన్‌లో ప్రయాణిస్తున్న జిన్నూరుపాలెం గ్రామస్తులంతా వ్యవసాయ, రోజు వారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారే. ఇందులో మృతుడు ఉమాసత్యసాయి ఎలక్ట్రికల్ విభాగంలో పాలిటెక్నిక్ పూర్తి చేసి ఇటీవలే కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్ష కూడా పాసయ్యాడు. ఫిజికల్ టెస్ట్‌కు సిద్ధమవుతున్నాడు. దీనికోసం శిక్షణ తీసుకుంటున్నాడు. అతని తండ్రి సూరిబాబు ఉపాధి నిమిత్తం గుజరాత్‌లో ఉంటూ అక్కడ ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నాడు. తల్లి వెంకటేశ్వరి గృహిణి. వీరికి కుమారుడు ఉమాసత్యసాయి, కుమార్తె దివ్య ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

- ముల్లుల ఆంజనేయులు 10వ తరగతి చదివాడు. ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి రెండేళ్లు పని చేశాడు. ఏడాది కిందటే స్వగ్రామానికి వచ్చాడు. అతని తల్లిదండ్రులు సత్యనారాయణ, లక్ష్మి వ్యవసాయ పనులు చేస్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కాగా మృతిచెందిన ఆంజనేయులు చిన్న కొడుకు. దైవ దర్శనానికి వెళ్లి వస్తూ ఇలా మృత్యువాత పడడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



కాలువలోకి దూసుకుపోయి ఆగిన బస్సు

తప్పిన పెను ప్రమాదం

వేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు రోడ్డు పక్కగా నిలిపిన వ్యాన్‌ను ఢీకొట్టి ఉంటే టీ కోసం ఆగిన ప్రయాణికులంతా రెండు వాహనాల మధ్య చిక్కుకుని మృత్యువాత పడేవారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అంతేకాకుండా బస్సులో ప్రయాణికులూ గాయపడేవారు. బస్సు కాలువలోకి దూసుకెళ్లి ఆగిన ప్రాంతంలో చెట్టు ఉంది. దానిని ఢీకొని ఉంటే బస్సులోని ప్రయాణికులూ గాయాలపాలయ్యే వారు. హైదరాబాద్ నుంచి విశాఖ, భువనేశ్వర్ వెళుతున్న ట్రావెల్ బస్సు ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడడంతో వారు ఇతర వాహనాల్లో తమ గమ్యాలకు పయనమయ్యారు.



సురక్షితంగా బయటపడిన బస్సు ప్రయాణికులు



ఉమాసత్యసాయి మృతదేహం వద్ద విలపిస్తున్న తోటి ప్రయాణికులు

కల్యాణాలకు కాస్త బ్రేక్

- రెండు నెలల తాత్కాలిక విరామం
- ఈ సీజన్‌లో ఆదివారం జరిగినవే చివరివి
- నవదంపతులు, భక్తులతో రత్నగిరిపై రద్దీ
- తిరిగి ఆగస్టు 20 నుంచి శుభ ముహూర్తాలు

అన్నవరం: నిత్య కల్యాణం.. పచ్చతోరణంలా రెండు నెలలుగా సాగిన వివాహాలు తదితర శుభకార్యాలకు తాత్కాలికంగా తెరపడింది. ఆదివారం రాత్రి, తెల్లవారు జామున జరిగే వివాహాలే ఈ సీజన్‌లో చివరివి. తిరిగి వివాహాలు జరగాలంటే సుమారు రెండు నెలలు ఆగాల్సిందేనని పండితులు చెబుతున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు ఆషాఢ మాసం. జూలై 18వ తేదీ నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసం. ఈ రెండు నెలల్లో కూడా వివాహాలు జరగవు. తిరిగి ఆగస్టు 17 నుంచి ప్రారంభమవుతున్న నిజ శ్రావణ మాసంలోనే శుభకార్యాలు జరుగుతాయి. ఆగస్టు 20వ తేదీ నుంచి తిరిగి వివాహాలు జరుగుతాయని పండితులు అంటున్నారు.

45 రోజులూ... పెళ్లిసందళ్లు

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో గత ఏప్రిల్ 26 నుంచి పెళ్లిళ్ల సందడి ప్రారంభమైంది. మధ్యలో రెండు మూడు రోజులు ముహూర్తాలు లేకపోయినా సుమారు 45 రోజుల పాటు వివాహాలు జరిగాయి. ఈ రోజుల్లో రత్నగిరిపై సుమారు 1,500 వివాహాలు జరగ్గా ఇతర ప్రాంతాలలో పెళ్లిళ్లు చేసుకున్న సుమారు ఐదు వేల జంటలు సత్యదేవుని సన్నిధికి తరలివచ్చి స్వామివారి వ్రతాలాచరించారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, స్వామివారి ఆలయం నవ దంపతులతో సందడిగా మారాయి.



రత్నగిరిపై వివాహాలతో సందడి



సత్యదేవుని సన్నిధిలో నవ దంపతుల పూజలు

పెళ్లిళ్ల సీజన్‌లో రూ.20 కోట్ల ఆదాయం

వివాహాల సీజన్‌తో అన్నవరం దేవస్థానానికి అత్యధిక ఆదాయం సమకూరింది. గత 45 రోజుల్లో ఏ రోజు కూడా ఆదాయం రోజుకు రూ.25 లక్షలు తగ్గలేదు. గత శనివారం స్వామివారి ఆదాయం రూ.70 లక్షలు వచ్చింది. మొత్తం మీద 45 రోజుల్లో సుమారు రూ.20 కోట్లు సమకూరినట్లు అధికారుల అంచనా.

తగ్గనున్న రద్దీ..

వచ్చే రెండు నెలలు ఆషాఢం, అధిక శ్రావణ మాసంతో వివాహ ముహూర్తాలు లేకపోవడంతో దేవస్థానానికి భక్తులు రద్దీ పెద్దగా ఉండదు. అంతేకాదు వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తిరిగి తెరుస్తున్నందున విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాక కూడా తగ్గనుంది. తిరిగి ఆగస్టు 20వ తేదీ నుంచి వివాహ ముహూర్తాలు కూడా ఉండడంతో రత్నగిరిపై, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు జరిగే అవకాశం ఉండడంతో అప్పటి నుంచి స్వామివారి ఆలయం నవ దంపతులతో కిటకిటలాడనుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ రాజమండ్రి నారాయణపురంలో 250 చ.గ.లో గల ★గ్రౌండ్ ఫ్లోర్ 2BHK-1 Flat , ★1st ఫ్లోర్‌లో 2BHK-2 Flats, ★2nd & 3rd ఫ్లోర్స్ డూప్లెక్స్ లగ్జరీ విల్లా -2 అమ్మకమునకు కలవు. Cont: 91002 33999 [R-5902]

SITE FOR SALE

■ బిర్లాగ్రాసిం కంపెనీ దగ్గరలో బాలవరం గ్రామం వద్ద సెంటు 1 లక్ష నుండి 1 1/2 లక్ష వరకు 3 నుండి 5 సెంట్లు ఇళ్ళ స్థలములు కలవు. ✆ : 85558 11599 [R-1180914]

PLOT FOR SALE

■ 255 sq yard open Plot For Sale at korlampet, Devichowk, Rajahmundry. Please Contact 7900570052 [WB-9701]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 S [R-5917]

BUSINESS OFFER

■ నెలకు లక్షపైన ఆదాయం వచ్చు మాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ (మ్యాషినరీ) & ప్రొడక్ట్ ఫార్ములాతో సింగిల్ యూనిట్ 16 లక్షలకు & డబుల్ 25 లక్షలకు సప్లై & ఇన్‌స్టాల్ చేసి ఇవ్వబడును. Hyd.7396798623 [H-793439]

■ 200చ.గ.లో నూతనంగా నిర్మించిన పెద్దఓమాన్యుఫ్యాక్చరింగ్ మిషనరీ, రామెటీరియల్స్ & ఫార్ములాతో రన్నింగ్ బిజినెస్ చేసుకొనుటకు 1కోటి 10లక్షలు అమ్మకంనకు కలదు.గండిమైసమ్మ,Hyd.7396798623 [H-793438]

LOANS & FINANCE

■ Vehicle Loans (old & New) we provide all Types of Vehicle loans at your door Steps (JCB, PC200 Cars, Bikes, Tractors) Cell No: 93470 84529 [R-5915]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2403]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781989]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. M/F, Qly: 10th ఆపైన, 2 వీలర్ కలిగి ఉండాలి. Cont: సాయి వెంకటేశ్వర MMA కో-ఆపరేటివ్ సొసైటీ, డో.నెం. 29-14-107, దేవీచౌక్, రాజమండ్రి. ✆ : 93931 75999 [R-5919]

■ ప్రముఖ TV Channel నందు జిల్లాల వారీగా పనిచేయుటకు Reporters, Marketing Executives, Editiors, Anchors & Writers కావలెను. ఫోన్ : 80744 03993, 0883 – 3586270 [V- 794468]

■ గ్లోబల్ సర్టిఫైడ్ కంపెనీ నందు గొప్ప అవకాశం. ఇంటి వద్ద వర్క్ చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన. నిరుద్యోగులు, గృహిణులు, 18+ అందరూ అర్హులే. సంప్ర : 99123 13348 [V- 794630]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221314]

■ రాజమండ్రిలో ప్రముఖ బ్యాంక్ రికవరీ ఎజెన్సీ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టూ వీలర్ మస్ట్.9182571445, 6300184746. [C-785799]

■ ఇంటిపని, బేబీకేర్, పేషెంట్‌కేర్, వంటపని, Sal: 15K to 30K రూం+భోజనం, లోన్, బోనస్ ఫ్రీ/ Ph: 9160002192/ 9160002193 [H-781329]

■ MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫీమేల్, Qly: 10th, జీతం: 16,000-18,000. ఫోన్ : 9010034405, 8008860389. [HA-233]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:16K-18K. విజయవాడ. Ph: 96405 28899, 96406 48899. [HA-257]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP Dr, Q.5th- డిగ్రీ, 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-260]

■ ప్రముఖ బ్యాంక్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జనరల్ షిఫ్ట్, 26 Days. ప్రదేశం: మల్కిపురం, పెద్దాపురం, జగ్గంపేట, రావులపాలెం, రాజమండ్రి. ✆ 83411 69265

■ Urgent Requirement for site engineers and supervisors in reputed apartments construction company in Rajahmundry. Min 3+years of exp required. 9491859111, 8247455659 [G-7122]

■ ప్రముఖ కంపెనీలో ఎర్రచందనం ఫామ్ ల్యాండ్స్ ప్రాజెక్ట్ మార్కెటింగ్ చేయుటకు లీడర్స్ కావలెను. మంచి కమీషన్, కార్ ఫండ్, హౌస్ ఫండ్, హోదా, ఇన్సెంటివ్స్, అలవెన్స్‌లు ఇవ్వబడును. మా ప్రాజెక్ట్ ప్రకాశం, నెల్లూరు జిల్లాల దగ్గరలో 8367587799 [G-104]

■ Wanted Marketing Incharges, Marketing Vice Principals, Marketing Executives. Qualification: Any Degree, Salary: 12000/- to 30000/-. Experienced Persons Preferrable, Age: 25 to 45, Job Location: Rajahmundry. Master Minds College. Contact: 92487 33370 [G-4343]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ధర్మవరం గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. ధర్మవరం గ్రామానికి చెందిన బత్తిన వీర్రాజు (35) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. కాలు, చేయి పనిచేయక ఇబ్బందులు పడుతున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పక్షవాతంతో కుటుంబానికి ఏవిధంగానూ ఉపయోగపడడం లేదన్న మనస్తాపంతో శనివారం రాత్రి ఇంటి నుంచి ఆ గ్రామ చిన్న చెరువు వద్దకు వెళ్లి, గడ్డి నివారణకు వాడే మందు తాగాడు. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన వీర్రాజు ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో బంధువులు గాలించారు. చివరికి అతను మృతి చెందినట్లు గుర్తించారు. మృతుని సోదరుడు బత్తిన లోవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం పవన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నల్లజర్ల: పోతవరం గ్రామ శివార్లలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొమ్ముగూడెంకు చెందిన కోరపు లక్ష్మి (44) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమె కుమారుడైన కోరపు ఏసుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తల్లీ కుమారుడూ ఆదివారం ఉదయం కొయ్యలగూడెంలో జరిగిన ఓ వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తున్నారు. పోతవరం శివార్లలో వారి బైక్ విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన ఏసును తొలుత రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం అతడిని విజయవాడ తరలించారు. నల్లజర్ల ఎస్‌ఐ నరసింహమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరసింహమూర్తి

బంగారు ఆభరణాల చోరీ

నల్లజర్ల: దూబచర్ల గ్రామంలోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. సుంకవల్లి వివేకానంద శ్రీహరి, వెంకట సీతామహాలక్ష్మి దంపతులు ఈనెల 8న విజయవాడలో జరిగిన వివాహానికి వెళ్లారు. వారు అక్కడి నుంచి ఆదివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు, లోపల బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన ఎనిమిదిన్నర కాసుల బంగారు ఆభరణాలు, కిలోన్నర వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఈ చోరీపై సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లజర్ల సీఐ నున్న రాజు, ఎస్‌ఐ నరసింహమూర్తి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు.

ఎరక్కపోయి వెళ్లి.. ఇరుక్కుపోయి..

లారీ వెనుక టైరులో చిక్కుకున్న కారు

కొవ్వూరు: వేగంగా వెళ్తున్న ఓ లారీని తప్పించే ప్రయత్నంలో ఓ కారు లారీ వెనుక టైరులో ఇరుక్కుపోయింది. కొవ్వూరు మెరక వీధిలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. దొమ్మేరు వైపు వెళుతున్న లారీని వెనుక వస్తున్న కారు డ్రైవర్ ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో కారు లారీ ముందు టైరుకు తగలడంతో కారు అడ్డంగా తిరిగింది. దీంతో లారీ వెనుక చక్రాల్లో అది ఇరుక్కుపోయింది. ఈ ఘటనతో ఎవరికీ గాయాలు కాలేదు. ఆ ప్రాంతంలో మాత్రం ట్రాఫిక్ స్తంభించింది. పట్టణ పోలీసులు క్రేన్ సాయంతో కారును బయటకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. దీనిపై ఏవిధమైన ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.



కొవ్వూరులో లారీ వెనుక టైరులో ఇరుక్కుపోయిన కారు

మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో 26వ ర్యాంకు

అమలాపురం రూరల్: అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన చీకట్ల వెంకట సంతోష్ జాతీయ స్థాయి మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి 26వ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో పీజీలో ప్రవేశానికి పీజీ సెట్ 2023 నిర్వహించింది. ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో సంతోష్ జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు సాధించాడు. ప్రధాన సెంట్రల్ యూనివర్సిటీలో ఎండీ జనరల్ మెడిసిన్ చేస్తానని సంతోష్ తెలిపారు. కొత్తపేటలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న డాక్టర్ చీకట్ల వెంకట నారాయణ కుమారుడైన సంతోష్ జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు సాధించడం పలువురు అభినందనలు తెలిపారు. అమలాపురం శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ గోశాల నిర్వాహకుడు పోతురాజు రామకృష్ణారావు, ప్రతినిధులు చాగంటి వరప్రసాద్, నూకల ప్రసాద్, లింగోలు విస్సు, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అతన్ని ఆదివారం అభినందించారు.



సంతోష్

ఆర్టీసీ బస్సులో మందుబాబుల వీరంగం


డ్రైవర్‌పై దాడి

తాళ్లరేవు: ఆర్టీసీ బస్సులో మందుబాబులు వీరంగం సృష్టించి, డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ ఘటనతో డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. స్థానికులు, ఆర్టీసీ డ్రైవర్ రాంబాబు, కండక్టర్ శివ కథనం ప్రకారం.. యానాం నుంచి రామచంద్రపురం వెళుతున్న ఆర్టీసీ బస్సును కొంత మంది ఆకతాయిలు ఆటోలో వెంబడించారు. ఇంజరం చర్చి సమీపంలోకి వచ్చేసరికి బస్సు ముందు ఆటోను నిలిపారు. ఆటోలోంచి ఐదుగురు దిగి బస్సు ఎక్కారు. ఇందులో ఒక వ్యక్తి బస్సు రాజమహేంద్రవరం వెళుతుందా అని కండక్టర్ శివను అడిగాడు. వెళ్లదని, రామచంద్రపురం వెళుతుందని చెప్పడంతో ఎందుకు వెళ్లదంటూ వీరంగం చేశాడు. టిక్కెట్ తీసుకోమని కండక్టర్ అడగడంతో తాను తీసుకోనని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ అసభ్య పదజాలం వాడాడు. దీంతో చేసేదిలేక డ్రైవర్ రాంబాబు బస్సును నిలిపివేశారు. ఆగ్రహానికి గురైన ఆకతాయిలు డ్రైవర్‌పై దాడి చేయడంతో పాటు ఇంజిన్ స్టీరింగ్‌పైకి ఎక్కి వీరంగం చేశారు. ఆ సమయంలో సుమారు 40 మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. దీనిని అడ్డుకున్న ప్రయాణికులపైనా ఎదురుదాడికి దిగారు. ఎట్టకేలకు ఆర్టీసీ అధికారుల అనుమతితో ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. తమపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆర్టీసీ డ్రైవర్ రాంబాబు తెలిపారు.

రైతులను బెదిరించిన విలేకరులపై కేసు

బిక్కవోలు: రైతులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న 15 మంది విలేకరులపై కేసు నమోదు చేసినట్లు అనపర్తి సీఐ విపత్తి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పగలు ఎండ కారణంగా రాత్రి సమయంలో పొలాల్లోని ఎత్తు, పల్లాలు సరిచేసుకుంటున్న రైతులు ఇడదాసి రాంబాబు, సత్తిబాబుల వద్దకు ఆ విలేకరులు వెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడమే కాకుండా, దౌర్జన్యం చేశారని ఫిర్యాదు అందిందన్నారు. సుమారు 15 మంది వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని తమ ట్రాక్టర్లు, జేసీబీ తాళాలు దౌర్జన్యంగా లాక్కోవడంతో ఘర్షణ జరిగిందని రైతులు పేర్కొన్నారన్నారు. దీంతో విలేకరులు తమ వెంట తెచ్చుకున్న బటన్ స్టిక్‌లతో దాడికి ప్రయత్నించగా గ్రామస్తుల సహకారంతో ఎదుర్కొన్నామని వారు ఫిర్యాదు చేశారన్నారు. ఏడాది కాలంగా విలేకరుల ముసుగులో కొంత మంది మండలంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సీఐ వివరించారు.

కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన మేడపాటి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రాయవరానికి చెందిన పాస్టర్ పలివెల ప్రసాద్, కొమరిపాలెం గ్రామానికి చెందిన మల్లిడి కృష్ణారెడ్డి, మెట్రో రాజశేఖర్, పందలపాక గ్రామానికి చెందిన రేవు సురేష్, బొమ్మకంటి సుబ్బారావు, సుర్ల శ్రీనివాస్, ఊల్లపల్లి చెందిన మద్దూరు వీరబాబు, బలభద్రపురానికి చెందిన కొండేటి శ్రీమన్నారాయణలతో కలసి కొన్ని నెలలుగా మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో ఒక సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి మండల వ్యాప్తంగా దందాలకు పాల్పడుతున్నారన్నారు. ఆ బృందం బిక్కవోలులోనే కాకుండా పెదపూడి, రంగంపేట, రాయవరం మండలాల్లో తమ దందాలను చేస్తుందన్నారు. వీరు అమాయక రైతులు, వ్యాపారస్తులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడి డబ్బులు గుంజుతున్నారని అన్నారు. ఇంకా బాధితులెవరైనా ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, వారికి తగిన భద్రత కల్పిస్తామని సీఐ భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల గురించి వారు పని చేస్తున్న యాజమాన్యాలకు తెలియజేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్సై పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్